# ఆరు నెలల్లో 'స్పిరిట్' పూర్తి?



'కల్కి' చిత్రంతో వరల్డ్‌వైడ్‌గా బ్లాక్ బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఆయన 'రాజా సాబ్' 'ఫౌజీ' చిత్రాలను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఆ తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న 'స్పిరిట్' సినిమాలో జాయిన్ అవుతారు. 'యానిమల్' వంటి సంచలన చిత్రం తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆయన డ్యూయల్ రోల్‌ను పోషించనున్నారని, రణబీర్ కపూర్, విజయ్ దేవరకొండ అతిథి పాత్రల్లో నటిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా.. తాజా ఇంటర్వ్యూలో 'స్పిరిట్' నిర్మాతల్లో ఒకరైన భూషణ్ కుమార్ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. డిసెంబర్ నెలాఖరులో సినిమాను సెట్స్‌మీదకు తీసుకెళ్తామని, ఆరు నెలల వ్యవధిలో షూటింగ్‌ను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. దీనిని బట్టి వచ్చే దసరా కల్లా 'స్పిరిట్' విడుదలకు సిద్ధంగా ఉంటుందని అభిమానులు అంచనా వేస్తున్నారు. 'స్పిరిట్' పక్కా కమర్షియల్ సినిమా కాబట్టి షూటింగ్‌ను త్వరగా పూర్తి చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని, పోస్ట్ ప్రొడక్షన్స్‌కు కూడా అంతగా సమయం పట్టకపోవచ్చని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# తెర వెనక ముచ్చట్లు



హీరో రానా 'ది రానా దగ్గుబాటి షో' పేరుతో ఓ సెలబ్రిటీ టాక్‌షోకు హోస్ట్‌గా వ్యవహరించబోతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా స్వీయ నిర్మాణంలో రూపొందిస్తున్న ఈ ఒరిజినల్ సిరీస్ ఈ నెల 23 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. మొత్తం ఎనిమిది ఎపిసోడ్స్‌లో రాబోతున్న ఈ సిరీస్‌లో సెలబ్రిటీలు వారి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకోవడంతో పాటు వివిధ యాక్టివిటీస్‌లో పాల్గొంటారు. రాజమౌళి, రామ్‌గోపాల్‌వర్మ, దుల్కర్ సల్మాన్, నాగచైతన్య, సిద్ధూ జొన్నలగడ్డ, శ్రీలీల, నాని వంటి ప్రముఖులు ఈ టాక్‌షోలో పాల్గొనబోతున్నారు. ఫిల్టర్ చేయని సంభాషణలు, సెలబ్రిటీల తెర వెనక ముచ్చట్లు, ఇప్పటివరకు వారి ఫ్యాన్స్‌కు తెలియని విశేషాలతో ఈ టాక్‌షో వీక్షకులకు ఆకట్టుకుంటుందని ప్రైమ్ ఇండియా ఒరిజినల్స్ హెడ్ నిఖిల్ మధోక్ తెలిపారు. సినీ తారల నిజ జీవితాలను తెలుసుకోవడానికి ఇదొక అద్భుతమైన వేదిక అని టాక్‌షో హోస్ట్, క్రియేటర్ రానా పేర్కొన్నారు.

# బ్రేకప్ వల్ల డిప్రెషన్‌లోకి వెళ్లా!




కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ వెలుగువెలిగింది పంజాబీ భామ రాశీఖన్నా. 'థాంక్యూ' సినిమా తర్వాత టాలీవుడ్‌లో కాస్త బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం 'తెలుసు కదా' అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో ఆమె నటించిన 'ది సబర్మతీ రిపోర్ట్' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. గుజరాత్ గోద్రా రైలు దహనం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ప్రమోషన్‌లో తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రాశీఖన్నా. గతంలో తాను ప్రేమలో ఉన్నానని, అనుకోని కారణాల వల్ల బ్రేకప్ అయిందని తన విఫల ప్రేమను తలచుకొని భావోద్వేగానికి గురైంది. రాశీఖన్నా మాట్లాడుతూ 'నేను చాలా సున్నిత మనస్కురాలిని. కొన్నేళ్ల క్రిందట ఓ వ్యక్తిని గాఢంగా ప్రేమించాను. కానీ దురదృష్టవశాత్తు మేమిద్దరం విడిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. కొన్ని నెలల పాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. ఆ తర్వాత ధైర్యాన్ని కూడగట్టుకొని కెరీర్ మీద దృష్టి పెట్టాను. నా శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల మద్దతు వల్ల ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడ్డా' అని చెప్పింది. అయితే తనతో ప్రేమాయణం నడిపిన వ్యక్తి గురించి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు రాశీ ఖన్నా. దాంతో సదరు వ్యక్తి ఎవరోనని అభిమానులు ఆరా తీస్తున్నారు. రంజన్ చందేల్ దర్శకత్వం వహించిన 'ది సబర్మతీ రిపోర్ట్' ఈ నెల 15న విడుదల కానుంది.

# ఈ ఏడాది కలిసొచ్చింది



''మట్కా' చిత్రంలో సుజాత అనే అమాయకమైన అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. మూడు భిన్నమైన కాల వ్యవధుల్లో నా క్యారెక్టర్ సాగుతుంది. ఒక జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరిస్తూ ఎమోషనల్‌గా ఉంటుంది' అని చెప్పింది మీనాక్షి చౌదరి. ఇటీవల విడుదలైన 'లక్కీ భాస్కర్' చిత్రంతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న ఈ భామ తాజాగా 'మట్కా' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నది. వరుణ్‌తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'ఈ ఏడాది బాగా కలిసొచ్చింది. 'లక్కీ భాస్కర్' విజయం సాధించింది. ఇప్పుడు 'మట్కా' విడుదలకానుంది. ఇదే నెలలో 'మెకానిక్ రాకీ' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఇలా ఒకే నెలలో మూడు చిత్రాలు రావడం స్పెషల్ మూమెంట్‌గా భావిస్తున్నా' అని చెప్పింది. 'మట్కా' సినిమాలో తాను పోషించిన సుజాత పాత్ర గురించి మాట్లాడుతూ 'తను ఎప్పుడు ఆశావహదృక్పథంతో కనిపిస్తుంది. హీరో వాసు జీవితంలో ఓ వెలుగులా ఉంటుంది. ప్రతీ అమ్మాయి నా పాత్రతో కనెక్ట్ అవుతుంది. ముఖ్యంగా భిన్న కాలాల్లో నా పాత్ర పరివర్తన చెందే తీరు ఆసక్తికరంగా అనిపిస్తుంది. యుక్త వయస్సు పాత్రలో వింటేజ్ లుక్‌లో కనిపిస్తాను. ఆ తర్వాత జీవితంలోని దశలు మారేకొద్ది నా లుక్స్ మారుతుంటాయి. ఇది పీరియాడిక్ డ్రామా కాబట్టి ఈ సినిమా విషయంలో చాలా హోమ్‌వర్క్ చేశాను' అని చెప్పింది. నటిగా అన్ని జోనర్స్ ఇష్టమేనని, ప్రేక్షకులకు గుర్తుండిపోయే బలమైన పాత్రలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నానని మీనాక్షి చౌదరి పేర్కొంది.

# 'లాపతా లేడీస్' టైటిల్ మారింది!




కిరణ్ రావు దర్శకత్వంలో అమీర్‌ఖాన్ నిర్మించిన 'లాపతా లేడీస్' చిన్న చిత్రంగా విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. మహిళా సాధికారత, స్వేచ్ఛ ప్రధానాంశాలుగా ఉత్తర భారత గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకొంది. 2025 ఆస్కార్ బరిలో భారత్ తరపున అధికారిక చిత్రంగా ఎంపికైన విషయం తెలిసిందే. ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలో ఆస్కార్‌ను దక్కించుకునేందుకు అమీర్‌ఖాన్, కిరణ్‌రావు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆస్కార్ ప్రచారం కోసం ఈ సినిమా టైటిల్‌ను 'లాస్ట్ లేడీస్'గా మార్చుతున్నట్లు చిత్ర బృందం సోషల్‌మీడియా వేదికగా ప్రకటించింది. అంతర్జాతీయ స్థాయిలో టైటిల్‌కు రీచ్ వచ్చేలా ఈ నిర్ణయం తీసుకున్నామని, హిందీ అర్థాన్ని స్ఫురించేలా ఇంగ్లీష్‌లో 'లాస్ట్ లేడీస్' అనే టైటిల్ పెట్టామని అమీర్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. మార్చిలో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రంలో నితాన్షి గోయల్, ప్రతిభా రాంటా, స్పర్శ్ శ్రీవాస్తవ తదితరులు ప్రధాన పాత్రల్ని పోషించారు.

# 'గాడ్స్ ప్రీమియర్ లీగ్' ప్రారంభం

పవన్‌శంకర్, యాని, హెబ్బాపటేల్, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'జీపీఎల్' (గాడ్స్ ప్రీమియర్ లీగ్') చిత్రం బుధవారం ప్రారంభమైంది. జీఎం నాయుడు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అల్లు సాయి లక్ష్మణ్ నిర్మిస్తున్నారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ఈ నెల 14 నుంచి మొదటి షెడ్యూల్ ప్రారంభిస్తామని దర్శకుడు తెలిపారు. భగవంతుడి ఆదేశాల మేరకే మన జీవితాలు నడుస్తాయనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్ కంద, సంగీతం: మణిశర్మ, దర్శకత్వం: జీఎం నాయుడు.



# అల్లు అర్జున్ పీరియాడిక్ స్టోరీ



సినీరంగంలో కొన్ని కాంబినేషన్స్‌కు ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంటుంది. అలాంటి వాటిలో త్రివిక్రమ్, అల్లు అర్జున్ కాంబో ఒకటి. వీరిద్దరి కలయికలో వచ్చిన జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో చిత్రాలు ప్రేక్షకుల్ని ఎంతగానో అలరించాయి. తాజాగా ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌లో మరో చిత్రం రాబోతున్న విషయం తెలిసిందే. 'పుష్ప-2' రిలీజ్ తర్వాత అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్‌లో జాయిన్ కాబోతున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై యస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ ఒకటి ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. పీరియాడిక్ కథాంశంతో దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, తన గత చిత్రాలకు భిన్నంగా పాన్ ఇండియాకు రీచ్ అయ్యేలా ఈ కథను తీర్చిదిద్దుతున్నారని తెలిసింది. బన్నీకి ఉన్న గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సబ్జెక్ట్ విషయంలో త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెబుతున్నారు. జూన్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. త్రివిక్రమ్, అల్లు అర్జున్ కాంబినేషనలో రాబోతున్న ఈ నాలుగో చిత్రంపై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి.

# పరశురాముడి ఇతివృత్తంతో 'మహావతార్'



ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో పౌరాణిక, చారిత్రక చిత్రాల నిర్మాణం ఇటీవలకాలంలో ఊపందుకుంది. ముఖ్యంగా భారతీయ పురాణేతిహాసాలను వెండితెర దృశ్యమానం చేయడానికి దర్శకనిర్మాతలు ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు. ఆ కోవలోనే హిందీలో.. పరశురాముడి ఇతివృత్తంతో 'మహావతార్' చిత్రం రాబోతున్నది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా నటించబోతున్న ఈ చిత్రాన్ని దినేష్ విజన్ నిర్మించబోతున్నారు. అమర్‌కౌశిక్ దర్శకత్వం వహిస్తారు. బుధవారం పరశురాముడిగా విక్కీకౌశల్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అబ్బురపరిచే విజువల్స్, రోమాంచితమైన యాక్షన్ ఘట్టాలతో గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరువయ్యేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని మేకర్స్ తెలిపారు. ఇంటెన్స్ యాక్షన్, డ్రామాతో వరల్డ్‌వైడ్‌గా ప్రేక్షకుల్ని ఈ సినిమా ఆకట్టుకుంటుందని విక్కీ కౌశల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పేర్కొన్నారు. 2026 క్రిస్టమస్ సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. పరశురాముడిగా విక్కీకౌశల్ పవర్‌ఫుల్ లుక్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.





